

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## చిరుత కాదు.. హైనా..

**షాద్‌నగర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** షాద్ నగర్ పట్టణంలోని శ్రీ బాలాజీ టౌన్షిప్, సిరి సంపదలు చుట్టుపక్కల ప్రాంతాల్లో సంచరిస్తున్నది చిరుత పులి కాదని అది హైనా అని షాద్ నగర్ అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. ఈ సందర్భం గా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రవీందర్, బీట్ ఆఫీసర్ వినోద్ కుమార్, ఎల్కిచర్ల అధికారి రవీందర్ రెడ్డి, స్థానిక అధికారి మొహమ్మద్ అబ్దుల్ అజీజ్, ఆమన్ గల్ కు చెందిన అధికారి రాఘవేందర్ తదితరులు బాలాజీ టౌన్షిప్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. స్థాని కులతో మాట్లాడారు. ఇక్కడ లభించిన జాడల ఆధారంగా సీసీటీవీ పుటేజుల ఆధారంగా అడవి పిల్లి తో పాటు, హైనా ఆనవాళ్లు కనిపించా యని పేర్కొన్నారు. అయితే చిరుత పులి కాదని అది మాత్రం హైనా అని తెలిపారు. ప్రస్తుతం కాలనీవాసుల కు ఇప్పుడేం ప్రమాదం లేదని దాన్ని జాడలు కనుక్కొని చర్యలు చేపడతామని వారు భరోసా ఇచ్చారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## 14న ప్రజా సంఘాల డివిజన్ స్థాయి సెమినార్

**షాద్‌నగర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అనే ఓ మహోత్తర చారిత్రక ఘట్టంపై నిర్వహించే సెమినార్ ను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఈ నెల 14న ఉదయం 10 గంటలకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి సెమినార్ ఉంటుందని ప్రజా కార్మిక యువజన ప్రజాస్వామిక వాదులు పాల్గొని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింహులు గౌడ్, మండల కార్యదర్శి బిజిలి సత్యం. సిఐటియు జిల్లా అధ్యక్షులు రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్, గిరిజన సంఘం నాయకులు ఈశ్వర్ నాయక్, ఆవాజ్, మహమ్మద్ బాబు, రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు వెంకటరమణ, ఎం నర్సింలు. ఎస్ డబ్ల్యూఎఫ్ నాయకులు రవీందర్ రెడ్డి భవన నిర్మాణ సంఘం రాములు మరియు ఉపాధి హామీ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం అన్నదాతల గోస

-వర్షంలోను క్యూలైన్‌లో నిలుచున్న రైతులు

-బస్తా యూరియా కోసం గంటల తరబడి ఎదురుచూపులు

- వచ్చేదెన్నడో అన్నదాతల అవస్థలు తీరేదెన్నడో ?



వర్షంలో గొడుగులు పట్టుకొని క్యూలో నిలుచున్న రైతులు

**పెద్దేముల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** యూరియ కోసం అన్నదాతలు అరిగోస పడుతున్న పట్టించుకునేవారే కరువయ్యారు. అన్నం పెట్టె రైతన్నకే కష్టాలు ఎదురైతే అడిగేవారే లేకుండా పోయారు. బస్తా యూరియ కోసం గంటల తరబడి నిలుచున్న దొరికేది కష్టమే. దేశానికి వెన్నెముఖ రైతన్న, రైతు లేనిదేరాజ్యము లేదు అని పొగడ్తలే తప్పా అన్నదాతలను ఆదుకున్నవారే లేకుండా పోయారని ఏకరువు పెడుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి యూరియ కోసంఅన్నదాతలు పడుతున్న అవస్థలు అంతా ఇంతా కాదు. యూరియ ఎప్పుడు వస్తుంది ఎక్కడ వస్తుంది అని తెలుసుకోని గంటల తరబడి క్యూలైన్‌లో నిలుచున్నదొరకుతొందని గ్యారేంటీ లేదు. అలాంటి అవస్థలు పడుతున్న రైతన్నలను పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. రైతులు క్యూలైన్‌లో గంటల తరబడి నిలుబడటం చూస్తుంటే అనాటి సినిమా టిక్కెట్ల కోసం థియేటర్ల వద్ద నిలుచున్నట్లు కనిపిస్తోందని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గురువారం పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘంలో 225 సంచుల యూరియ వచ్చింది. సుమారు మూడునాలుగు వందల మంది రైతులు క్యూ లైన్‌లో నిలుచున్నారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన వర్షం సుమారు 12: 30 గంటల వరకు కురిసింది. వర్షం పడుతున్నయూరియ కోసం రైతన్నలు కొందరు తడుస్తు, మరికొందరు టవాళలు, గొడుగులు పట్టుకొని నిలుచున్నారు. ప్రతి రైతుకు బస్తా చొప్పున యూరియ అందజేశారు.మిగిలిన రైతులు యూరియ దొరకక తడిసిన బట్టలతో తిరుగుముఖం పట్టారు. జోరు వానలో తడిసిన తమకు బస్తా యూరియ అయిన లభించలేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. యూరియ కోసం ఇంకెన్నాళ్ళు నిరిక్షించాలని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. యూరియ వచ్చేదెన్నడో అన్నదాతల అవస్థలు తీరేదెన్నడోనని ఉసురుమంటున్నారు.

# నాణ్యత హుష్‌కాకి

- ప్రమాణాలు పాటించని రెస్టారెంట్లు
- చట్టాలు అమలు చేసే నాథుడు కరువు
- తూతూమంత్రంగా ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు
- మున్సిపల్ శానిటరీ విభాగం లంచావతారం



తాండూరులో బిర్యానీలో బొద్దింక వచ్చిన దృశ్యాలు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లలో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తున్నారు. కలుషితమైన ఆహారం అందజేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వినియోగదారుల ఆరోగ్యాన్ని గాలికొదిలేశారు. అడ్డదిడ్డంగా వండి పెడుతూ నిబంధనలకు పాతర వేస్తున్నారు. దీనిపై కఠినంగా వ్యవహరించాల్సిన సంబంధిత అధికారులు పత్తా లేకుండా పోయారు. స్థానిక సంస్థల అధికారులు లంచాలకు రుచిమరిగి రెస్టారెంట్ల జోలికి వెళ్లడం లేదు. అసలే వర్షాకాలం.. పైగా ముసురు పడుతున్న వేళ.. పలు హోటళ్లలో పరిశుభ్రత పాటించడం లేదు.. ఎక్కడా నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదు. నిబంధనలను పగడ్బంధీగా అమలు చేయాల్సిన అధికారులు ఉదాసీనతపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఎక్కడైనా ఫుడ్ పాయిజనింగ్ జరిగినప్పుడు నిద్రలేచే అధికారగణం నిరంతరంగా హోటళ్లపై తనిఖీలు నిర్వహించకపోవడం విడ్డూరమని వినియోగదారులు వాపోతున్నారు. తాజాగా తాండూరు పట్టణంలోని దుర్గా గ్రాండ్యూవర్ హోటల్‌లో బిర్యానీలో బొద్దింక రావడం నిర్వాహకులు నిర్లక్ష్యానికి, అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. బిర్యానీ తిన్న వినియోగదారులతో దురుసుగా వ్యవహరించిన రెస్టారెంట్ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మున్సిపల్ అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. అయితే, హోటల్ నిర్వాహకులతో కుమ్మక్కైన మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది గంట ఆలస్యంగా తనిఖీలకు వచ్చారు. తాము రైడ్స్‌కు వస్తున్నామని ముందస్తు సమాచారం ఇవ్వడంతో హోటల్ నిర్వాహకులు కిచెన్ ను శుభ్రంగా చేయడం, డీప్ ఫ్రిజ్‌లలో ఆహార పదార్థాలను తొలగించడం వంటి చర్యలకు పాల్పడ్డారని తెలిసింది. గంట తర్వాత వచ్చిన మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది కొంత సీన్ సృష్టించి రూ.25 వేల జరిమానా విధించి వెళ్లిపోయారు. అయితే, బొద్దింక వచ్చిన ఆహారాన్ని సీజ్ చేసి టెస్ట్‌ల నిమిత్తం ల్యాబ్‌కు పంపలేదని సమాచారం. ఇప్పటి వరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు మాత్రం తనిఖీలకు రాలేకపోయారు. ఒక్క తాండూరు దుర్గా గ్రాండ్యూవర్ హోటలే కాకుండా జిల్లాలోని అనేక హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లలో, దాబాలలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. కల్తీ వంటనూనెలు వాడుతున్నారు. కుళ్లిపోయిన మటన్, చికెన్, ఫిష్, కూరగాయలను వండుతున్నా ఏనాడూ పట్టుకున్న పాపాన పోలేదు. వంటగదులు, భోజన హాళ్లు అపరిశుభ్రంగానే ఉంటున్నాయి. బార్లలో మరీ అధ్వాన్న పరిస్థితులు ఉన్నాయి. పాన్ మసాలాలు తింటూ కిచెన్ పరిసరాల్లోనే ఉమ్మేస్తూ వంటలు వండుతున్నట్లు తెలిసింది. టాయిటెంట్లు కంపు కొడుతున్నా శుభ్రపరచడం లేదని వినియోగదారులు చెబుతున్నారు.

**చట్టాలు ఏం చెబుతున్నాయి..**

ఆహార నాణ్యత నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యాక్ట్ 2006ను అమలులోకి తెచ్చింది. ఈ చట్టంలోని సెక్షన్ 31 ప్రకారం ప్రతీ రెస్టారెంట్ యజమాని ఆహారం అమ్మేందుకు ఫుడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. యజమానులు కచ్చితంగా ఫుడ్ సేఫ్టీ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలి. ఎవరైనా లైసెన్స్ లేకుండా రెస్టారెంట్ నడిపితే ఆరు నెలల జైలు శిక్ష. గరిష్టంగా రూ.5 లక్షల జరిమానా విధించాలన్న నిబంధనలు ఉన్నాయి. కానీ అధికారులు ఎక్కడ తనిఖీలు చేపట్టారో బహిర్గతం చేయడం లేదు. ఇప్పటి వరకు ఎన్ని లైసెన్స్‌లు ఉన్నాయనే వివరాలు గోప్యంగా ఉంచారు. దాడులు చేయడం లేదు.. పెద్దగా జరిమానాలు విధించడం లేదని తెలుస్తున్నది. హోటళ్లు, రెస్టారెంట్లలో వడ్డించే ఆహార పదార్థాలలో కల్తీ ఉన్నట్లు తేలితే ఆహార భద్రత ప్రమాణాల చట్టం -2006లోని సెక్షన్ 54 ప్రకారం రూ.లక్ష జరిమానా విధించాలి. మురికి లేదా అపరిశుభ్రతగా ఉండే హోటల్ నిర్వాహకులకు రూ.లక్ష జరిమానా విధించాలన్న నిబంధనలు ఉన్నాయి. కానీ జిల్లాలో ఎక్కడా ఈ చట్టం అమలు కావడం లేదు. చాలా హోటళ్లు అపరిశుభ్రంగానే ఉన్నాయి. ప్రజల ఆరోగ్యం పట్ల అధికారులకు చిత్తశుద్ధి లేదని తేలిపోతున్నది. రెస్టారెంట్లలో సురక్షితమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు వండాలి.

వినియోగదారులు ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదులు చేసిన దాఖలలు చాలా తక్కువ. ఎందుకంటే ఈ శాఖ ఉందనే విషయం చాలామందికి అవగాహన లేదు. చాలావరకు మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారుల వరకు వెళ్లి ఫిర్యాదు చేసి చేతులు దులుపుకొంటున్నారు. కానీ ఎఫ్‌ఎఫ్‌ఎస్ అధికారులు ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లోకి వెళ్లి నేరుగా ఫిర్యాదు చేసుకునే అవకాశాలు ఉన్నా ఎవరికీ అవగాహన కలుగడం లేదు. వినియోగదారుల్లో అవగాహన పెంపొందించాల్సిన ప్రభుత్వం కూడా ఆ దిశగా అడుగులు వేయడం లేదని విమర్శలు వస్తున్నాయి. పింఛన్, ఇండ్లు, ఇతర సబ్సిడీల గురించి అవగాహన ఉన్న యువత అనునిత్యం మోసాలకు గురవుతున్న వినియోగదారుల గురించి అవగాహన పెద్దగా ఉండటం లేదని తెలుస్తున్నది.

## గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో అక్రమ వాణిజ్య షెడ్లు

-పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని 2 వ వార్డు పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణ షెడ్లు

**మేడ్చల్, సెప్టెంబర్ 11. ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో అక్రమ కట్టడాల సమస్య మళ్లీ చర్చనీ యాంశంగా మారింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 2వ వార్డు, పూడూరు గ్రామం సర్వే నంబర్లు 439/2, 440, 441, 442 వద్ద ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వాణిజ్య షెడ్ నిర్మాణాలు జరుగుతున్నాయి. మున్సిపల్ చట్టాల ప్రకారం ప్రతి వాణిజ్య నిర్మాణానికి ముందుగా మున్సిపాలిటీ అనుమతులు, పన్నులు, డెవలప్‌మెంట్ ఛార్జీలు చెల్లించడం తప్పనిసరి. అయితే సంబంధిత నిర్మాణదారులు ఈ ప్రక్రియను పట్టించుకోకపోవడంతో మున్సిపాలిటీకి రావలసిన ఆదాయం నష్టమవుతుంది. ఇది కేవలం ఆర్థిక పరమైన సమస్య మాత్రమే కాకుండా, నియమావళిని ఉల్లంఘించడం వల్ల భవిష్యత్తులో పట్టణ ప్రణాళికలో అవ్యవస్థకు దారితీసే అవకాశం ఉంది. ఇక స్థానిక వర్గాల సమాచారం ప్రకారం, ఈ అక్రమాలకు గుండ్లపోచంపల్లి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ప్రమేయం ఉన్నట్లు, అలాగే కొంతమంది బిల్ కలెక్టర్లు కూడా ఇందులో భాగస్వాములయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అధికార పార్టీ నాయకులకు పెద్ద మొత్తంలో ముట్టచెప్పి, మిగతా వారిని మేనేజ్ చేస్తూ అక్రమ నిర్మాణాలకు పచ్చజెండా ఊపుతున్నారని ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. దీంతో మున్సిపాలిటీ యంత్రాంగం పూర్తిగా రాజకీయ మద్దతుతో నడుస్తోందనే విమర్శలు వస్తున్నాయి. స్థానికులు చెబు తున్న ప్రకారం, ఈ అక్రమ నిర్మాణాలు కొనసాగితే ప్రజా భద్రతపైనా ప్రభా వం పడే అవకాశం ఉంది. అక్రమ వాణిజ్య కట్టడాలు పెరగడం మునిసిపా లిటీ పరిపాలనపై ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో గుండ్లపోచం పల్లి మున్సిపాలిటీ 2వ వార్డు మాజీ కౌన్సిలర్ శ్రీలత శ్రీనివాస్ రెడ్డి గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదులో, పూడూరులోని పై సర్వే నంబర్లలో జరుగుతున్న అక్రమ వాణిజ్య షెడ్ల నిర్మాణాలను వెంటనే ఆపి, సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## దంచికొట్టిన వాన...

-పొంగిపొర్లిన వాగులు, వంకలు

-నిలిచిపోయిన రాకపోకలు



ఉధృతంగా ప్రవహిస్తున్న తట్టెపల్లి - బండమీదిపల్లి వాగు

**పెద్దేముల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలంలోని ఆయా గ్రామాలలో గురువారం వర్షం దంచికొట్టింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లిరాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం 9 గంటల నుంచి సుమారు మద్యాహ్నం 12:30 వరకు ఏకదాటిగా వర్షం పడటంతో ఆయా గ్రామాలలోని చెరువులు,కుంటలు పూర్తిగి నిండి అలుగులు పారాయి. మండలంలోని తింసాన్‌పల్లి, రుద్రారం, పెద్దేముల్‌తాండా దుంకుడు వాగు, తట్టెపల్లి - బండమీదిపల్లి వాగులు రొడ్డుపై నుంచి ఉధృతంగా ప్రవహించాయి. దీంతో ఆయా మార్గాలలో రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఊహించకుండా ఉదయంనుంచే వర్షం ఏకదాటిగా కురవడంతో వ్యవసాయ పనులకు ఆటంకం కలిగాయి. పత్తి పంటలో వర్షపు నీరు నిలిచి రైతులకు ఇబ్బందికరంగా మారాయి.

## వాగులో వ్యక్తి గల్లంతు ..!

- తాండూరు మండలం సంగెంకలాన్‌లో ఘటన..

- అప్రమత్తమైన అధికారులు.. ముమ్మరంగా గాలింపు చర్యలు..



ఉధృతంగా ప్రవహిస్తున్న దిడ్డి వాగు.

**తాండూరు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. తాండూరు నియోజకవర్గ పరిధిలో ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తుంది. వర్షానికి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని సంగెంకలాన్ గ్రామ సమీపంలోని దిడ్డి వాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తుంది. సాయంత్రం వేళ గ్రామానికి చెందిన మొగులప్ప అనే వ్యక్తి పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా వాగులో కొట్టుకుపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. వాగులో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు, రెవెన్యూ, ఫైర్ శాఖల అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## కాలే యాదయ్య ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

-ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

-మహిళలను ఎరువుల కోసం నిలబెట్టిన ఘనత రేవంత్‌రెడ్డిదే

-మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి, అభివాదం చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

**షాబాద్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** బిజెపి, కాంగ్రెస్ పార్టీల ప్రభుత్వాలు ఎరువుల సరఫరాలో దొంగాటలాడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ పట్నాం అవినాష్రెడ్డి ఆధ్వర్యంలో స్టార్ గార్డెన్లో జరిగిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఐపీఎస్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మహిళలను కోటీశ్వర్లుగా మార్చుతానని, ప్రతి మీటింగ్లో చెప్పుతూ ఎరువుల కోసం మహిళలనే క్యూలైన్లలో నిలబెట్టి పరిస్థితి తీసుకువచ్చాడన్నారు. ఎరువుల కోసం రైతులు పడిగాపులు కాస్తూ ఏడుస్తుంటే. మంత్రులు పాత చెప్పులు లైన్లో పెడుతున్నారని తప్పుడు మాటలు ప్రచారం చేస్తున్నారని విదివ చేశారు. పారీ మారని పీఏసీఎస్ చైర్మన్లను నోటిసులు ఇచ్చి వేధిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టె ధైర్యం కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కోటిశ్వర్లుగా మార్చుతానని, ప్రతి మీటింగ్లో చెప్పుతూ ఎరువుల కోసం మహిళలనే క్యూలైన్లలో నిలబెట్టే పరిస్థితి తీసుకువచా కువచ్చాడన్నారు. ఏరువుల కోసం రైతులు పడిగాపులు కాస్తూ ఏడుస్తుంటే మంత్రులు పాత చెప్పులు లైన్లో పెడుతున్నారని పడుతున్నారని తప్పుడు మాటలు ప్రచారం చేస్తూన్నారని దేవ చేశారు. షార్ట్ మారని పీఏసీఎస్ చైర్మన్లను నోటీసులు ఇచ్చి వేరిస్తున్న మనవి పార్టీకే దక్కిందన్నారు స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టె వైద్యం కాంగ్రెస్ పార్టీకి లేదని, ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బీఎడ్జెస్ పార్టీదే గెలుపన్నారు. కాలే యాదయ్య రాజీనామా చేసే చేవెళ్ల లో ముఖం చూపించు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీది వ్యతిరేకంగా బిఆర్ఎస్ కార్యకర్తలు పోరాట యోధులుగా పోరాడి గత ఎన్నికల్లో యాదయ్యను గెలిపిస్తే పార్టీకి మోసం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. యాదయ్యకు చిత్తకద్ది ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి చేవెళ్ల ప్రజలకు ముఖం చూపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ అధికారులకు బదిలి చేయాలంటే రూ.30 లక్షలు డిమాండ్ చేస్తున్నారని ఆరోషిదారు. కేసీఆర్ ప్రభుత్వంలో 60 గ్రాముల కోడిగుడ్లు ఇస్తే, రేవంత్ సర్కార్లో 42 గ్రాముల గుడ్డును విద్యార్థులకు సరఫరా చేస్తున్నారు. మహారాష్ట్ర పోలీసులు హైదరాబాద్లో రూ.12 వేల కోట్ల మాదక ద్రవ్యాలను పట్టుకుంటే తెలంగాణ పోలీసులు మాత్రం కేసీఆర్, కెటీఆర్, బీఆర్ఎస్ నాయకుల మీద తప్పుడు కేసులు పెట్టడానికే సమయం కేటాయిస్తున్నారని అన్నారు. రాళేశ్వరం కూలి పోలేదని, కేసీఆర్ను బదనాం చేయడానికే బాంబులు పెట్టి ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల పర్రెడ్డి, షాబాద్, చేవెళ్ల పార్టీల మంచలాధ్యక్షులు నర్సింగ్ రావు, ప్రధానకార్యదర్శి శ్రీరాంరెడ్డి, ప్రభాకర్, సర్దార్నగర్ ఏఎంసీ మాజీ చైర్మన్లు వెంకటయ్య శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటీసీ రాజేందర్ గౌడ్, మాజీ కోఆప్షన్ మెంబర్, చాంద్ పాష సీనియర్ నాయకులు ఆంజనేయులు. రాజేందర్రెడ్డి, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పార్టీ కారుక్తలు పాల్గొన్నారు.

# సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులు

-చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



చేవెళ్లలోని ఈర్శరి బ్యాంకిట్ హాల్‌లో చేవెళ్ల మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త** సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులని, ఉపాధ్యాయులను గౌరవించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. గురువారం ఈర్శరి బ్యాంకిట్ హాల్‌లో చేవెళ్ల మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సన్మానించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ఒక విద్యార్ధి భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. భోధన వృత్తి కేవలం పాఠాలు చేప్పడం మాత్రమే కాదని, సమాజానికి మంచి పౌరులను తీర్చిదిద్దడమన్నారు. జీవితాల్లో తల్లిదండ్రుల తర్వాత గౌరవం సంపాదించే ఉపాధ్యాయుల వృత్తి అదర్శమన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థులకు సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు.విద్యారంగం అభివృద్దికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు.ఉపాధ్యాయ వత్తి ఎంతో పవిత్రమైనదని, విద్యార్ధులకు విద్యభోనతో పాటు క్రమ శిక్షణను నెర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమీషనర్ వెంకటేశం,చేవెళ్ల మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్య గౌడ్,వైస్ చైర్మన్ బి.రాములు, చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి,ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్‌లు పాండు, జెఎల్ ఆర్, మాజీ ఎంపిటిసిలు బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి, గుండాల రాములు,మాజీ సర్పంచులు జనార్ధన్ రెడ్డి,గోపాల్‌రెడ్డి,మోహన్‌రెడ్డి,పడాల ప్రభాకర్, రమేష్‌గౌడ్,కేసారం శ్రీనివవాస్ బండారి శైలజ ఆగిరెడ్డి,కాంగ్రేస్ పార్టీ మండల అద్యక్షులు వీరేందర్‌రెడ్డి,చేవెళ్ల మున్సిపల్ అద్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్,నాయకులు మర్పల్లి క్రిష్టారెడ్డి,ఆగిరెడ్డి, మదుసూదన్‌గుప్తా,

రవీందర్,నరేందర్‌గౌడ్,మాజీ ఉప సర్పంచ్ గంగి యాదయ్య, ముడిమ్యాల సహాకర సంఘం డైరెక్టర్ మల్లేష్,మండల విద్యాది . కారి పురందాస్,మండలంలోని ఉపాధ్యాయులు తదితరులు పాల్గోన్నారు.

## ఆయుర్వేద వైద్యంతోనే దీర్ఘకాలిక రోగాలకు పరిష్కారం..



వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ సెక్రటరీ వైద్య సిబ్బంది గ్రామస్తులు

**యాచారం, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త**

ప్రాచీన ఆయుర్వేదంతోనే తీరకాలిక రోగాలు నయం అవుతాయని ఆయుర్వేద డాక్టర్ ఇందిర అన్నారు. గురువారం యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో ఆయుర్వేద వైద్య శిబిరము నిర్వహించారు .శిబిరంలో హాజరైన రోగులందరి షుగర్, పరీక్షలు బీపీ, పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో భాగంగా డాక్టర్ ఇందిరాగారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడమైనది అందరూ ప్రతి రోజు నీళ్లు వేడి చేసుకుని తీసుకోవడం వల్ల జలుబు దగ్గు వాటిని రాకుండా నివారించుకోవచ్చు అన్నారు.అలాగే మన పరిసరాల లో దొరికే తులసాకులు,మిరియాలు అల్లము కషాయంలో తీసుకోవడం వల్ల కూడా జలుబు దగ్గులను గొంతు నొప్పి రాకుండా నివారించుకోవచ్చు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ శ్రీనివాస్, ఆశ వర్కర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## ప్రాధమిక పాఠశాలలో గురుపూజోత్సవ కార్యక్రమం



.దేవరయాంజాల్‌లోని ప్రాధమిక పాఠశాలలో గురుపూజోత్సవం సందర్భంగ ఉపాద్యాయులను సన్మానించిన దృశ్యం

**శామీర్‌పేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త**

దేవరయాంజాల్‌లోని ప్రాధమిక పాఠశాలలో గురుపూజోత్సవ కార్యక్రమం జరిగింది. గురువారం శామీర్‌పేట మండలంలోని తూంకుంట మున్సిపాల్టీ పరిధిలో ఉన్న దేవరయాంజాల్ ప్రాధమిక పాఠశాలలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 5వ తేదీన సెలవు దినం కావటంతో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఆలస్యంగా జరుపుకున్నట్లు తెలిపారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచు నాలిక లక్ష్మినారాయణ, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, రామాలయ చైర్మన్ పెండం లక్ష్మినారాయణ, మాజీ ధర్మకర్త పి.నర్సింహ్మారెడ్డిలు ఆ పాఠశాల ప్రధానోపాద్యాయురాలు కళ్యాణితో పాటు ఉపాద్యాయులు రవీందర్‌చారి, లలిత, శివలక్ష్మి, రాఖీ, మమత లను ఘనంగా సన్మానించి సత్కరించారు. ప్రతి ఏటా ఉపాద్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాద్యాయులను సన్మానించటం, ఉత్సాహాన్ని అందిస్తున్న మాజీ ఉపసర్పంచు నాలిక లక్ష్మినారాయణకు వారు దన్యవాదాలు తెలియజేశారు. ఉపాద్యాయులను గౌరవించటం బాధ్యగా ఆయన తీసుకుని కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామల్లో జనాభా ప్రతిపాదిక రిజర్వేషన్లు ఇవ్వాలి

**- బిసి హక్కుల సాధన సమితి జిల్లా కమిటీ కార్యదర్శి యాదయ్య.**



ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న బీసీ సాధన సమితి జిల్లా కమిటీ కార్యదర్శి యాదయ్య, తదితరులు.

**మహేశ్వరం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో జనాభా ప్రతిపాదిక రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా కమిటీ కార్యదర్శి పల్నాటి యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహేశ్వరం నియోజకవర్గం కందుకూర్ ఆర్డీవో కార్యాలయంలో గురువారం బిసి హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా కమిటీ కార్యదర్శి పల్నాటి యాదయ్య ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ బందు బడ్జెట్‌లో ప్రవేశపెట్టి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో నామినేట్ పోస్టులలో కూడా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగం ప్రకారం బీసీలకు హక్కులు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే మేలుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాల పిల్లలకు న్యాయమైన ఉచిత విద్య అందుబాటులోకి తేవాలన్నారు.ఈ కార్యక్రమం బీసీ సంఘం మహేశ్వరం మండల కన్వీనర్ రాపోలు రమేష్. బీసీ బాలాపూర్ మండల కన్వీనర్ డి. శంకరయ్య. బీసీ సంఘం కందుకూరు మండల కన్వీనర్ బి. రామచద్రయ్య.రాజు. నరేందర్ పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

**షాబాద్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:**

విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లో ప్రావీణ్యత సాధించాలని షాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ అన్నారు. గురువారం షాబాద్ మండల ఆదర్శ పాఠశాలలో కళా ఉత్సవ్ 2025 మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే పాటలు, నృత్యాలు, చిత్రలేఖనం, శాస్త్రీయ నృత్యాలు, జానపద పాటలకు సంబంధించిన నృత్య పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన గ్రూప్ డాన్స్ ఆర్ పాయల్ గ్రూప్ (కేజీబీవీ షాబాద్), థియేటర్ ఆర్ట్ లో స్పందన గ్రూప్ (టీజీఎంఎస్ షాబాద్), చిత్రలేఖనంలో సోలో గౌతమి (టీజీఎంఎస్ షాబాద్), విజువల్ ఆర్ట్ గ్రూపులో పూజిత గ్రూప్(టీజీ ఎంఎస్ షాబాద్), సోలో సాంగ్ జైనబ్ నవజీవన్ హై స్కూల్, గ్రూప్ సాంగ్ లో దివ్యశ్రీ గ్రూప్ లు మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇన్చార్జి ప్రిన్సిపల్ డి.రాఘవేందర్, ఉపాధ్యాయ బృందం, తదితరులు, పాల్గొన్నారు.

## మిలాద్ ఉన్ నబి ర్యాలీని విజయవంతం చేయండి..

**షాద్‌నగర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :**

షాద్ నగర్ పట్టణంలో శుక్రవారం నిర్వహించి తలపెట్టిమిలాద్ ఉన్ నబీ ర్యాలీని విజయవంతం చేయాలని షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ పిలుపు ఇచ్చారు. మధ్యాహ్నం రెండు గంటలకు పటేల్ రోడ్డు జామియా మస్జిద్ నుండి 2000 మందితో భారీ ర్యాలీ జరుగుతుందని దీనిని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని కోరారు.

# రాజీవ్ రహదారిపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

**..మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌కు వినతి**

**శామీర్‌పేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త**

శామీర్‌పేట రాజీవ్‌రహదారిన నల్సార్ చౌరస్తా వద్ద, దర్గా ఆరంజ్‌బౌల్ చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు ఆ రెండు చౌరస్తాల వద్ద రేడియం స్పీడ్ బ్రేక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయటానికి తగు చర్యలు తీసుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌కు బిజెపి నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం శామీర్‌పేట ఓఆర్ఆర్ సమీపంలోని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ నివాసంకు శామీర్‌పేటకు చెందిన బిజెపి, బిజెవైఎం నాయకులు వెళ్లి శామీర్‌పేటలో రాజీవ్‌రహదారిన వాహనాల అతివేగంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని, పలువురు తీవ్రగాయాలకు గురవుతున్నారని ఆయా చౌరస్తాల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపి ఈటలను కోరారు. ఎంపి ఈటల రాజేందర్ దీనికి స్పందించి వెంటనే ఏసిపితో ఫోన్‌లో మాట్లాడి రోడ్డు ప్రమాదాలు జరగకుండ చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికి అవసరమైన ఎంపి నిధులు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అతి త్వరలో ఈ ప్రమాదాలకు గురికాకుండ చర్యలు తీసుకునేలా చూస్తానని తమతో ఎంపి ఈటల తెలిపారని బిజెపి నాయకులు తెలిపారు. ప్రధానంగ ఆర్‌అండ్‌బి, రాజీవ్‌రహదారి రోడ్డు నిర్వాహణ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం కూడ ఉందని పలువురు భావిస్తున్నారు. శామీర్‌పేటలో రాజీవ్‌రహదారి పక్కన వైఎస్ఆర్ చౌరస్తా వద్ద ఉన్న సర్వీస్ రోడ్డును కూడ మరమ్మతు పనులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి, బిజెవైఎం నాయకులు డి.పవన్‌గౌడ్, బి.శివ, విష్ణు, శ్రీకాంత్, కిరణ్,ప్రవీణ్, పలువురు యువకులు తదితరులు పాల్గొన్నారు.

**..కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన బిజెపి నాయకులు**

దీనికి ముందుగా తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జ్యోతిని బిజెపి నాయకులు కలిసి శామీర్‌పేటలోని రాజీవ్‌రహదారి నల్సార్ చౌరస్తా వద్ద, ఆరంజ్‌బౌల్-దర్గా చౌరస్తాల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు రేడియం స్పీడ్ బ్రేకర్స్,సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేసి కోరారు. గురువారం శామీర్‌పేట మండలంలోని తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జ్యోతిని బిజెపి, బిజెవైఎం నాయకులు కలిసి శామీర్‌పేటలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి వివరించి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కమిషనర్ జ్యోతి స్పందించారని రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటామని చెప్పారని బిజెపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి, బిజెవైఎం నాయకులు డి.పవన్‌గౌడ్, బి.శివ, విష్ణు, శ్రీకాంత్, కిరణ్, ప్రవీణ్, పలువురు యువకులు తదితరులు పాల్గొన్నారు. ఇదే విషయంపై బుధవారం రోజున శామీర్‌పేట పోలీసులకు కూడ కలిసి శామీర్‌పేట రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని అందజేసిన సంగతి తెలిసిందే. రోడ్డు ప్రమాదాల విషయంపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ద తీసుకుని నివారణకు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



శామీర్‌పేటలో రాజీవ్‌రహదారిన రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపి ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేసిన బిజెపి నాయకుల దృశ్యం

# డిజిటల్ టెక్నాలజీపై పోలీస్ అధికారులకు శిక్షణ

**మేడ్చల్, సెప్టెంబర్ 11. ప్రభాతవార్త :**

మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో మూడు రోజుల రిఫ్రెషర్ కోర్సు విజయవంతంగా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ మధూకర్ స్వామి తెలిపారు.మేడ్చల్ మండలంలోని కండ్లకోయలో గల పోలీస్ ట్రైనింగ్ కళాశాల (పీటీసీ)లో పోలీస్ అధికారులు డిజిటల్ టెక్నాలజీపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని 12 జిల్లాల నుండి 100 మంది పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అధికారుల డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించడం, ఆధునిక పద్ధతులను అవలంబించడం ద్వారా స్మార్ట్ పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ఈ శిక్షణా కార్యక్రమ లక్ష్యమని అన్నారు. సురక్షిత డిజిటల్ పద్ధతులు, సైబర్ నేరాల నివారణ, నేరాల గుర్తింపు, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్‌లో స్మార్ట్ టూల్స్ వినియోగం, మహిళలపై నేరాలను నివారించడానికి టెక్నాలజీ ఆధారిత వ్యూహాలు, డ్రగ్స్ ముప్పును డిజిటల్ ఇంటెలిజెన్స్‌ను ఎలా ఉపయోగించాలో అవగతమౌతుందని తెలిపారు. అదే విదంగా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌లో డేటా, టెక్ ఆధారిత పద్ధతులు, డిజిటల్ ప్లాట్‌పాంలో ఆధునిక పద్ధతులను సమన్వయం చేసి సమర్థవంతమైన ప్రజాసేవ చేయడానికి ఉపయోగపతుందన్నారు. ఈ రిఫ్రెషర్ కోర్సు ద్వారా విలువైన ప్రాక్టికల్ అవగాహన లభించడంతో పాటు, ఇంటర్‌డిస్ట్రిక్ట్ సహకారానికి వేదిక కల్పించబడిందని, ఈ సృజనాత్మక కోర్సు తెలంగాణ పోలీస్ విభాగం యొక్క ప్రజా భద్రత, స్మార్ట్, టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్ పట్ల అంకితభావాన్ని ప్రతిబింబించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణుడు ప్రమీల్ అర్జున్, సైబర్ క్రైమ్ ఫ్యాకల్టీ కె. అఖిలేశ్, మోటివేషనల్ స్పీకర్ శ్రీపాదరం, పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ కె.వి. విజయ్ కుమార్, డీఎస్పీ, ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు

# తుర్క కాశ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**శామీర్‌పేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త**

తుర్క కాశ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర తుర్క కాశ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా-మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు షేక్ మౌలానా,పలువురు నాయకులు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం మూడుచింతలపల్లి మండలం నుంచి పలువురు తుర్కకాశ సంఘం నాయకులు వారితో కలిసి ఎమ్మెల్యే మల్లారెడ్డి నివాసంకు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి వెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు. కార్మిక బందు కింద 10లక్షల రూపాయలు, 45సంవత్సరాలు నిండిన వారికి ప్రతి కార్మికుని పెన్షన్ ఇవ్వాలని, రాయి కొట్టే కార్మికునికి ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములలో ఉన్న గుట్టలను తుర్క కాశ సంఘాలకు ప్రభుత్వం ఇవ్వాలని, అదే విధంగ తుర్కకాశ గూడలను రాష్ట్ర ప్రభుత్వం దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని, రానున్న అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడి పైన తెలిపిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగ కృషి చేయాలని ఎమ్మెల్యే మల్లారెడ్డిని కోరినట్లు వారు పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పందించారని, ఈ విషయంపై సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లి తగిన పరిష్కారం చూపుతానని అసెంబ్లీ సమావేశాల్లోనూ మాట్లాడి పరిష్కాం జరిగే విధంగా కృషి చేస్తానని మల్లారెడ్డి భరోసా ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మాజీ సర్పంచు జామ్ రవి, మాజీ వార్డుసభ్యులు బూరుగు యాదగిరి, నాయకులు భూపాల్‌రెడ్డి, ఆర్.రాములు, ఎం.వీరేశం, నందుగౌడ్, తుర్కకాశ సంఘం జిల్లా, మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తుర్క కాశ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసిన మేడ్చల్ జిల్లా తుర్క కాశ అధ్యక్షులు,మాజీ సర్పంచు, మాజీ వార్డుసభ్యుల, తుర్కకాశల దృశ్యం

# దోపిడీ వ్యవస్థ తప్ప మరొకటి లేదు

**-షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు**

**-ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు**

**-రియల్ ఎస్టేట్ వ్యాపారాలపై తీవ్ర అభ్యంతరం**

**షాద్‌నగర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్రంలో ఎందరో మహానుభావులు సాయుధ పోరాటమే సరైన పంథాగా ఎంచుకొని భూమికోసం భుక్తి కోసం మాతృదేశ విముక్తి కోసం వినోదభావే లాంటి మహానుభావులు భూదాన ఉద్యమాలు నిర్వహించిన తెలంగాణ గడ్డపై ఇప్పుడు విచ్చలవిడిగా విశృంకళంగా భవిష్యత్తు తరాలకు భూమి లేకుండా చేస్తున్న బడా బాబుల నిర్వాకంపై షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు మండిపడ్డారు. గురువారం ఆయన స్వగృహంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రజాసంపద నిర్వీర్యమైందన్నారు. భూదాన ఉద్యమం సందర్భంగా ఆనాడు జరిగిన మహా ఉద్యమం నేడు లక్ష్యం నీరుగారి పోతుందని ఎన్నో భూములు అధికారుల పాలకుల దాహంతో మాయమైపోతున్నాయని అన్నారు. భవిష్యత్తు తరాల కోసం భూములను మొత్తం వ్యాపారమయంగా చేస్తే రాబోయే తరాలకు ఏం మిగులుతుందని అదేవిధంగా ప్రతి భూమిని ఇంటి స్థలంగా మార్చితే పచ్చని నేలల్లో పంటలు ఎలా పండుతాయని బక్కని ప్రశ్నించారు. లక్ష్యం కోసం ఏర్పాటుచేసిన భూదాన ఉద్యమ భూములు అసైన్డ్ భూములు ఇతరత్రా ప్రజా భూముల విషయంలో కూడా అధికారులు పాలకులు నాయకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో వాటి రూపురేఖలు మారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వినోభ బావే, బూరుగుల రామకృష్ణారావు, లంకాల నారాయణరెడ్డి ఎదిర రామచంద్రారెడ్డి ఇలాంటివారు భూదాన ఉద్యమంలో తమ వంతు పాత్ర పోషించారని 10,000 ఎకరాలను సముపార్జించి వాటిని నిరుపేదలకు పంచారని అలా పంచిన భూముల్లో భూదాన్ పోచంపల్లి గ్రామం ఆ పేరుపై వెలసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక గత పాలకుల నిర్లక్ష్యంతో ధరణి పేరిట ఎన్నో భూములకు రెక్కలు వచ్చి విచ్చలవిడిగా ఇతరులకు దారాదత్తమయ్యాయని చెప్పారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తారని మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ మాయలో కూడా నేడు పచ్చని పొలాలు కాంక్రీట్ జంగల్‌గా మారుతున్నాయని రాబోయే తరాలకు పర్యావరణం పంటలు ఏమవుతాయని ప్రశ్నించారు. కుటుంబాలకు అవసరమైనంత మాత్రమే సంపాదించడం ధర్మం అని కొంతకన్నా ఎక్కువ సంపాదిస్తే అది అధర్మమవుతుందని దానివల్ల వినాశనం తప్పదని బక్కని నరసింహులు ఆధ్యాత్మిక ధోరణితో హెచ్చరించారు. తనది విమర్శ కాదని విజ్ఞప్తి అని మీడియా ముందు కోరారు. ఈ సృష్టిలో భగవంతుడు భూమిని ఎవరికి అమ్మలేదని అది ప్రకృతి సంపదని దానిని నాటి తరాల నుండి నేటి వరకు మానవుడు అక్రమంగా తమ పేర్లపై కబ్జాలు చేస్తూ వస్తున్నాడని బక్కని చెప్పడం విశేషం. ప్రకృతి సంపద ఎప్పటికీ మానవుడి పరం కాలేదని వినాశకాలే విపరీత బుద్ధి అని ఈ సందర్భంగా బక్కని చెప్పుకొచ్చారు. ఈ మీడియా సమావేశంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ అనుమారీ వెంకటయ్య, సీనియర్ నాయకులు కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బక్కనే నర్సింలు

## మహిళల ఉపాధికి సహకారం అందిస్తా

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** మహిళలు ఉపాధి కల్పన కోసం కావాల్సిన సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందజేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సయ్యద్ ఆలియా సుల్తాన ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో వృత్తి కోర్సుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శిక్షణ పొందుతున్న వారిని ఉద్దేశించి మాట్లాడారు. అంజుమన్ ఫంక్షన్ హాల్ లో నిర్వాహకురాలు ఆలియా సుల్తానా ఆధ్వర్యంలో 300 మంది మహిళలు మహిళలకు శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. అక్కడ మైనారిటీ, పేద మహిళలకు కుట్టు శిక్షణ, బ్యూటీ పార్లర్ కోర్సులలో 60 రోజులు శిక్షణ కొరకు కావలసిన సౌకర్యాలతోపాటు ట్రైనింగ్ సామాగ్రి టీచర్స్ శాలరీ తన తరఫున మహిళా మణులకు అందిస్తానని హామీ ఇచ్చారు. దానితోపాటు అంజుమన్ ఫంక్షన్ హాల్ కమిటీ సభ్యులందరూ కలిసి అంజుమన్ ఫంక్షన్ హాల్ ను పునరుద్ధరించాలని వినతి పత్రం అందజేశారు. ఇందులో ఎంఐఎం నేత గౌస్, మహమ్మద్ పాషా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మహిళలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలి

**- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్**




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు.

**మహేశ్వరం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపి కృష్ణపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రిన్సిపాల్ గోపి కృష్ణపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమయపాలన పాటించకుండా ఇష్టారీతినా వ్యవరిస్తున్నారని తెలిపారు. ఉన్న ప్రిన్సిపల్ సమయం పాటించకుండా ఉంటే తోటి ఉపాధ్యాయులు ఏ విధంగా ఉంటారని ప్రశ్నించారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్యలో నష్టం వాటిల్లుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద స్కావెంజర్ల జీతాల కోసం వచ్చే నిధుల్లో అవకతవకలు జరిగినట్లు చెప్పారు. ఇద్దరు స్కావెంజర్లను నియమించి వారికి రూ.10 వేల చొప్పున ఇవ్వాల్సి ఉండగా రూ.7 వేల చొప్పున ఇస్తూ రూ.6 వేలు పక్కదారి పట్టిస్తున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో సిద్దు, తరుణ్,రాహుల్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులకు యూరియా కష్టాలు

**న-రైతులకు సరిపడా యూరియా ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం**

**-రాష్ట్ర బిసి కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్**

**పెద్దేముల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క బస్తా యూరియ కోసం రైతులకు కష్టాలు తప్పడంలేదని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఎన్,శుభప్రద్ పటేల్ ఆరోపించారు. గురువారం పెద్దేముల్ సొసైటి ముందు వర్షంలో యూరియ కోసం నిలుచున్న రైతులను చూసి ఆయన చలించిపోయారు.ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు పంటలు పండించుకోవడానికి ఉపయోగించే యూరియ కోసం పడరాని పాట్లుపడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో రైతులు క్యూలైన్‌లో నిలబడి కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే, ప్రస్తుతం యూరియ కోసం రైతులను క్యూలైన్‌లో నిలబెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. పెద్దేముల్ సొసైటికి 225 బస్తాల యూరియ వస్తే వేల మంది రైతులు సొసైటి ముందు పడిగాపులు కాయడం కాంగ్రెస్‌ప్రభుత్వ నిర్లక్షానికి పరాకాష్ట అని అన్నారు. గత 10 ఏండ్ల బిఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరోజు కూడా యూరియ కష్టాలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకుసరిపడా యూరియ సరఫరా చేయడంలో ఘోరం గా విఫలమైందని ఆరోపించారు. రైతుల కందని యూరియ కష్టాలను చూసి, రాష్ట్రంలోని రైతులందరికిసరిపడా యూరియ అందేలా చర్యలు తీసుకొని, దేశా నికి అన్నం పెట్టె రైతన్నను ఆదుకోవాలసిన అవసరం ఎంతైన ఉందని అన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**-కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ హన్మంతు**

**దౌల్తాబాద్,సెప్టెంబర్ 11,ప్రభాతవార్త:**

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ కోట్ల హన్మంతు ఉపాధ్యాయులకు ఆదేశించారు.దౌల్తాబాద్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌ను సందర్శించారు.విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతగా ఉండేల ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని చెప్పారు.విధ్యార్థుల కంటె ముందు ఉపాధ్యాయులు ఆహారం తినాలనీ,రోజు ఒకేరకమైన కురగాయలు వడ్డించకుండా రోజుకోవిధంగా విద్యార్థులకు కురగాయలను అందివ్వాలని సూచించారు.పాడైన గుడ్లను ఇవ్వవద్దని,ఆహారం నాణ్యతగా అందివ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## లైసెన్సుడు సర్వేయర్ల సప్లిమెంటరీ పరీక్షను సజావుగా నిర్వహించాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**

**వికారాబాద్, సెప్టెంబర్11, ప్రభాతవార్త :**

లైసెన్సుడ్ సర్వేయర్ల సప్లిమెంటరీ పరీక్ష ను సజావుగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. గురువారం సెప్టెంబర్ 14న నిర్వహించే లైసెన్సుడ్ సర్వేయర్ల సప్లిమెంటరీ పరీక్ష నిర్వహణకు సంబంధించి అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సమన్వయ సమావేశ నిర్మించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మాట్లాడుతూ, పరీక్ష ను సజావుగా నిర్వహించేందుకు గా ను అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. థియరీ పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు, ప్లాటింగ్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. లైసెన్సుడ్ సర్వేయర్ల పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 76 మంది థియరీ అభ్యర్థులు,92 మంది ప్లాటింగ్ అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షలు నిర్వహణలో ఎటువంటి కాపీయింగ్ లేకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్ల ు అ నుమతించకూడదని ఆయన పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి వచ్చే అభ్యర్థులు ఏదేని ప్రభుత్వ గుర్తింపు కార్డు ను తీసుకురావాలని ఆయన సూచించారు.పరీక్ష రోజున నిరంతర విద్యుత్తు ఉండేలా జాగ్రత్త తీసుకోవాలని సంబంధిత అధికారికి సూచించారు. పరీక్ష కేంద్ర పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పారిశుద్ధ్య ప నులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ కు సూచించారు.పరీక్షా కేంద్రం వద్ద అత్యవసర మందులతో పాటు వైద్య సిబ్బందిని నియమించాలని డిఎంహెచ్ఓ లలితా దేవికి తెలిపారు. పరీక్ష కేంద్రం వద్దకు ఇతరులు ప్రవేశించకుండా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రామిరెడ్డి, డీహెచ్ఎస్ఓ సత్తార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రగతికి నిధులు

**-నాలుగు పార్కులకు రూ.4 కోట్లు, మండలాల్లో తండాలకు రూ2.20 కోట్లు**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** షాద్ నగర్ నియోజకవర్గంలో ఆయా రోడ్ల అభివృద్ధి పనుల కోసం రూ.2.20 కోట్ల నిధులు, అదేవిధంగా పట్టణంలోని 4 పార్కులకు నాలుగు కోట్ల రూపాయలు మంజూరైనట్లు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్ నగర్ పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడారు. ఇందులో ఫరూక్ నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఈ నిధుల లో రూ. 40 లక్షలు అభివృద్ధి పనుల కోసం ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా నందిగామలో పాఠశాల అభివృద్ధితోపాటు మరికొన్ని అభివృద్ధి పనులు చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా కంసాన్ పల్లి పరిధిలో ఉన్న తాండాలలో బీటీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. కొత్తూరు మండలం జహంగీర్ పీర్ దర్గాలో బస్టాండ్ తో పాటు బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. చేగురు తండాలో అభివృద్ధి పనుల కోసం కోటి రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మండల పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కే చెన్నయ్య, శ్రీకాంత్ రెడ్డి, వీరేశం, హరినాథ్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, నరసింహ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ దామోదర్ రెడ్డి, గిరిజన నేత రఘునాయక్, ముబారక్ అలీ ఖాన్, లింగారెడ్డిగూడెం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

